**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

చేదబావిలోన చే తాడు గుంజుతూ
నీటినొసగెనంట నాటి జనులు
మీటనొక్కి నేడు మిద్దెమీదికి గూడ
తెచ్చుకొనిరి గదర తెలివితోడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 109 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 18-7-2025 | పేజిలు -8 | వెలః రూ. 5.00




## బలూచి లిబరేషన్ దాడులు

- వరుస ఘటనలతో పాక్ సైన్యం ఉక్కిరిబిక్కిరి
- రెండ్రోజుల్లో 27మంది సైనికుల హతం

**ఇస్లామాబాద్ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి సలుపనివ్వడం లేదు. వరుస దాడులతో విరుచుకు పడుతున్నారు. గత రెండ్రోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఇందులో 27 మంది సైనికులు చనిపోగా.. -మిగతా 2 లో



# కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషమే

## ఢిల్లీకి వెళ్లకుండా ఫామ్‌హౌజ్‌కు వెళ్లాలా

- కేంద్రంతో చర్చించకుంటే సమస్యలకు పరిష్కారమెలా
- పక్క రాష్ట్ర సీఎంతో చర్చలు జరపకుంటే ఎలా
- తుమ్మడిహట్టికోసం మహా సీఎంతో మాట్లాడుతా
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలు కాదు..ప్రణాళికతో రావాలి
- అన్ని కేసులపైనా పక్కా విచారణ జరుగుతోంది
- సీబీఐ పేరుతో రాజకీయం చేయాలనుకుంటున్న బీజేపీ
- తన సవాల్ కేసీఆర్ కే తప్ప కేటీఆర్‌కు కాదు
- విలన్లు ఎప్పుడూ క్లైమాక్స్‌లోనే అరెస్ట్ అవుతారు
- ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషం పెట్టుకుని మాట్లాడుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వాలని.. వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాల అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పలు అంశాలపై స్పష్టత ఇచ్చారు. తన పాలనపై విమర్శలు చేసే ప్రత్యర్థులపై సూటిగా వ్యాఖ్యలు చేశారు. -మిగతా 2 లో



## ఉనికి చాటుకునేందుకు హరీష్ యత్నం

- పసలేని వాదనలతో ప్రజలను తప్పదోవ పట్టించే చర్యలు
- అసెంబ్లీలో దమ్ముంటే ప్రాజెక్టులపై చర్చకు కేసీఆర్ రావాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శ

**హైదరాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హరీష్‌రావు ఆరు అడుగులు పెరిగాడే తప్ప అర అంగుళం మెదడు పెంచుకోలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శించారు. హరీష్ రావు వాదనలలో పసలేదన్నారు. ఢిల్లీ మీటింగ్‌లో ఏం జరిగిందో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చెప్పిన తర్వాత హరీష్ రావు పిచ్చి వాగుడు వాగుతూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సిఎంల భేటీపై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ -మిగతా 2 లో



## బీహార్‌లో నితీష్ ఉచిత వల

- 125 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఆఫర్

**పాట్నా** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటం తో నితీష్ ప్రభుత్వం ఓటర్లపై ఉచితాల వలను ప్రయోగించింది. ప్రజలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని గురువారం ప్రకటించారు. మొదటి నుండి రాష్ట్రవ్యాప్తంగా తక్కువ ధరలకు విద్యుత్‌ను అందిస్తున్నాము. ఇప్పుడు ఆగస్ట్ 1 నుండి అంటే జులై బిల్లు నుండే రాష్ట్రంలోని గృహ వినియోగదారులు 125 యూనిట్ల విద్యుత్ వరకు ఎలాంటి నగదు చెల్లించాల్సి అవసరం లేదు. దీంతో రాష్ట్రంలోని మొత్తం 1.67కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో గృహాల పైకప్పులపై లేదా ప్రభుత్వ స్థలాల్లో సౌరవిద్యుత్ పాలాంట్లను ఏర్పాటు- చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కుటీ-ర్ జ్యోతి పథకం కింద అత్యంత పేద కుటు-ంబాలకు, సౌరవిద్యుత్ పాలాంట్లకు అయ్యే ఖర్చును -మిగతా 2 లో

## కేంద్ర మంత్రి బండికి సిట్ నోటీసులు

- ఈ నెల 24 న విచారణకు రావాలని సిట్ నోటీసు జారీ



**హైదరాబాద్ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈనెల24న విచారణకు రావాలని కోరుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కి సిట్ నోటీసులు జారీ చేసింది. కేంద్ర మంత్రితోపాటు పీఆర్వో, పీఏలకూ సిట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ లేక్ -మిగతా 2 లో

## ఉపాధి హామీ లో దక్షిణాదిలో ఏపీ ఆదర్శం

**ఎక్స్ వేదికగా వెల్లడించిన పవన్ కళ్యాణ్**



**అమరావతి,** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణాది రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన తన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. -మిగతా 2 లో



## రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు

- బీఆర్ఎస్ నేతల ఇళ్లపై దాడులు
- కేటీఆర్‌పై చిల్లర విమర్శలు మానాలి
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్** రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందని బిఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటి పైన దాడి, నా క్యాంపు కార్యాలయం, పాడి కౌశిక్ రెడ్డి ఇంటి పైన, సునీత లక్ష్మారెడ్డి పైన , మర్రి రాజశేఖర్ రెడ్డిపైన దాడి చేస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్రంలో పూర్తిగా శాంతి భద్రతలు కరువై హత్యలు, ఎక్కువ అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ఆదాయం పడిపోయింది. చిల్లర మాటలు బంద్ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశాడు. ఎవడో దుబాయ్‌లో చనిపోతే మా కేటీఆర్‌కు ఏం సంబంధం. ఆ రిపోర్ట్ నీ దగ్గర ఏమైనా ఉంటే రేవంత్ రెడ్డి ముక్కులో పెట్టు-కో. ఈడీ ఎందుకు రేవంత్ రెడ్డిని అరెస్ట్ చెయ్యడం లేదు, కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డికి అండగా ఉంటు-న్నాడు. కేంద్రంతో సఖ్యతతో ఉంటానని పేరుకే అంటు-న్నావు, నీ వల్ల రాష్ట్రానికి ఒక్క ఉపయోగం జరగలేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కేటీ-ఆర్ పైన చేసిన ఆరోపణల్లో రుజువు ఉంటే చూపించు లేదంటే కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పు రేవంత్ రెడ్డి. లోకేష్, కేటీఆర్‌ను అర్ధరాత్రి పూట కలిశాడు అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. అర్ధరాత్రి పోయి కలిసే అలవాటు- రేవంత్ రెడ్డికే ఉన్నది, -మిగతా 2 లో

## రష్యాతో ఇంధన ఒప్పందం చేసుకుంటాం

- ఆంక్షలు విధించడానికి మీరెవరూ!



**న్యూఢిల్లీ ,** రష్యాతో ఇంధన ఒప్పందంపై అభ్యంతరాలు తెలుపుతూ నాటో చీఫ్ మార్క్ రుట్టే చేసిన వ్యాఖ్యలపై భారత్ మండిపడింది. రష్యాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ ఆంక్షలు విధిస్తామని హెచ్చరించడాన్ని భారత విదేశాంగ మీడియా ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తప్పుబట్టారు. ద్వంద్వ ప్రమాణాలను పాటించడం సరికాదని గురువారం పశ్చిమా దేశాలను జైస్వాల్ హెచ్చరించారు.నాటో చీఫ్ వ్యాఖ్యలను.. ప్రస్తుతం నెలకొన్న పరిణామాలను నిశితంగా -మిగతా 2 లో

# నాపై డ్రగ్స్ కేసు నమోదైందా?



## దమ్ముంటే ఆధారాలు బయటపెట్టు..

- కనీసం అణువంత రుజువైనా ఉన్నదా?
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

**హైదరాబాద్ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చిట్‌చాట్ పేరుతో రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన అడ్డగోలు వ్యాఖ్యలు, ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మీడియా చిట్‌చాట్ పేరుతో నాపైన, ఇతరులపైన విషయం చిమ్మడం ఇదే మొదటిసారి కాదు. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయానికి గౌరవం ఇచ్చి ఇప్పటివరకు సంయమనం పాటించాను అని కేటీఆర్ తెలిపారు.డ్రగ్స్ కేసులో నాపై విచారణ జరుగుతుందని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకి ఆధారం ఏమిటో -మిగతా 2 లో

## బీఆర్ఎస్ వాళ్లు బీసీ ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారు

- బీసీ ఆర్డినెన్స్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు



- ఇది ముమ్మాటికీ ఆమోదయోగ్యమేనని ప్రకటన
- న్యాయనిపుణలుతో చర్చించే వ్యాఖ్యానిస్తున్నట్లు వెల్లడి
- తీన్మార్ మల్లన్న విమర్శలను ఖండించకపోవడంపై ఆగ్రహం

**హైదరాబాద్ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత ఊహించని షాక్ ఇచ్చారు. ఇంటిపార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారు.. అది తప్పు అని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందే అని చెప్పారు. తాను న్యాయపరంగా అందరినీ సంప్రదించే కాంగ్రెస్ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు -మిగతా 2 లో

# కేసీఆర్ కుటుంబం కడుపునిండా విషమే

(మొదటి తరువాయి)

ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్ నేతలపై ఘాటైన పదజాలంతో ప్రస్తావించారు. కేంద్రంతో చర్చలు జరుపకుంటే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు సీఎం. రాష్ట్రానికి సంబంధించి పలు ముఖ్యమైన అంశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రులతో చర్చించామని తెలిపారు. ఇండియా, పాకిస్తాన్ మధ్యే నీటి పంపిణీపై చర్చలు జరుగుతుంటే, నేను పక్క రాష్ట్రం సీఎంతో మాట్లాడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్రలో పర్యటిస్తానని సీఎం తెలిపారు. రెండున్నరేళ్లలో లక్ష ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్ తప్ప పాత పథకాలన్నీ అమల్లోనే ఉన్నాయని చెప్పారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖలు రాయడం కాదని.. ప్రణాళికతో ముందుకు రావాలని సూచించారు. ఆయనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రేవంత్ తెలిపారు. నదుల అనుసంధానం కోసం కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇచ్చంపల్లి నుంచి కావేరికి అనుసంధా నించాలనే ప్రతిపాదన ఉంది. ప్రతిపక్షనేత పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను కేటీఆర్ అడుగుతున్నారు. దానికి కేసీఆర్ అంగీకరించడం లేదు. సొంత వివాదాలతోనే ఆ కుటుంబానికి సరిపోతోంది. కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవడం లేదు. కేంద్రం పిలిచినప్పుడు వెళ్లకుండా.. కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లాలా?అక్కడికి వెళ్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి?హైదరాబాద్‌లో లోకేశ్‌ని కేటీఆర్ చీకట్లో ఎందుకు కలిశారు? కేదార్ అనే వ్యక్తితో కలిసి కేటీఆర్ దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకున్నారు. డ్రగ్స్ కలగలిపి తీసుకోవడం వల్లే కేదార్ మరణించాడు. ఆయన మరణంపై పూర్తినివేదిక ఉంది. మద్యంలో కాక్టైయిల్ విన్నాం.. డ్రగ్స్‌లో తొలిసారి కాక్‌టెయిల్ అని వింటు-న్నాం. అవసరమైనప్పుడు కేదార్ మరణానికి గల కారణాల రిపోర్టును బయటపెడతాం. ఆ రిపోర్టును అసెంబ్లీలో పెట్టడానికీ సిద్ధమే. నేను చర్చిస్తానంటోంది ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో మాత్రమే.. కేటీఆర్‌తో కాదని స్పష్టం చేశారు. ఢిల్లీకి వెళ్లడం నేరంగా మాట్లాడుతున్నారు.. కేంద్రానికి సంబంధించిన అంశాలపై కేంద్రంతోనే మాట్లాడాలన్నారు. ఢిల్లీకి వెళ్లకుండా ఎక్కడికి వెళ్లాలి.. ఫామ్ హౌస్ కి వెళ్ళాలా? అని ఫైర్ అయ్యారు. 33, 34 సార్లు ఢిల్లీకి వచ్చానని.. 48 సార్లు వచ్చానని మాట్లాడుతున్నారన్నారు. తన ప్రియారిటి రాష్ట్రమని.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, వివాదాలను పరిష్కరించుకోవడం ముఖ్యమన్నారు. వ్యూహంతో పని చేస్తున్నామని.. గత ప్రభుత్వం సాధించనివి ఎన్నో.. తాను సాధించానన్నారు. ఢిల్లీలో కేంద్రం ఉన్నప్పుడు, ఇక్కడికి వచ్చే రాష్ట్రం కోసం మాట్లాడాలన్నారు. తాను ఎవరికైనా భయపడితే రేవంత్ రెడ్డిని కాదని ఫైర్ అయ్యారు.. రాష్ట్ర అవసరాల కోసం ఢిల్లీతోపాటు, అవసరమైతే రాష్ట్రాలకు కూడా వెళ్లాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్తామని.. నీటి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై అక్కడ మాట్లాడుతామన్నారు.బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ ఎలాంటి చర్చలు జరగలేదని ప్రకటించిందని సీఎం తెలిపారు. అయితే, తాను ఇప్పటికే మూడు సమస్యలను పరిష్కరిం చానని పేర్కొన్నారు. మిగిలిన సమస్యలపై అధికారులు, సాంకేతిక నిపుణుల కమిటీ- చర్చిస్తుందని వివరించారు. నేను ఇంజనీర్ కాదు... సాంకేతిక అధ్యయనం తర్వాతే నిర్ణయం తీసుకుంటాం అని పేర్కొన్నారు. ప్రజలు నాకు అధికారం ఇచ్చారు.. రాష్ట్ర సమస్యలను కేంద్రానికి తీసుకెళ్లడం నా బాధ్యతని సీఎం స్పష్టం చేశారు. ఢిల్లీకి కాకుండా ఫామ్ హౌస్‌కు వెళ్తే సమస్యలు పరిష్కారం కావు అని పరోక్షంగా కేసీఆర్‌పై విమర్శలు చేశారు. నెలకు ఖచ్చితంగా రెండు సార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో సమన్వయం చేసుకుంటానని హామీ ఇచ్చారు.ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో అసెంబ్లీలో చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. కేటీఆర్ నాయకత్వాన్ని చెల్లెలే అంగీకరించడం లేదు. గతంలో సవాల్ విసిరితే పారిపోయారని అంటూ తీవ్ర విమర్శలు చేశారు. గంజాయి బ్యాచ్‌కి నేను భయపడను. భయపడి ఉంటే నేను రేవంత్ రెడ్డి అవుతానా? అంటూ విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై మా వ్యూహం మాకుందని, కేటీఆర్ డ్రగ్స్ కేసుపై, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుందన్నారు. విలన్లు క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారని, కేటీఆర్ లోకేష్ ల మీటింగ్ సంగతేంటని ఆయన ప్రశ్నించారు. కిషన్ రెడ్డికి బీసీ రిజర్వేషన్లపై సవాల్ విసిరిన రేవంత్.. ఫోన్ ట్యాపింగ్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంతో కలిసి పని చేస్తామని, కేసీఆర్ సభకు రావాలన్నారు. తనపై ఉన్న కేసులపై హడావుడి చేయడం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. నేను హడావుడి చేస్తే మళ్లీ మీడియానే ప్రశ్నిస్తుంది అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ సీబీఐ కేసుల పేరుతో రాజకీయాలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. రెండేళ్ల తర్వాత కార్పొరేషన్ నామినే-టె-డ్ పోస్టులను మళ్లీ భర్తీ చేస్తామని సీఎం ప్రకటించారు. గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరుగుతుంది. విలన్లు ఎప్పుడైనా క్లైమాక్స్ లోనే అరెస్ట్ అవుతారు. కాళేశ్వరం, ఫోన్ టాపింగ్, హెచ్‌ఎండిఏ ఎన్నో కేసులో విచారణ జరుగుతుంది. ఫోన్ టాపింగ్ కేస్ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతుంది. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు హైకోర్టుకు వివరిస్తున్నాం. ప్రభాకర్ రావు ఇండియాకు ఆలస్యంగా రావడానికి కారణం కేంద్ర ప్రభుత్వమే.. కేంద్రం ఎందుకు ప్రభాకర్ రావును తీసుకురాలేదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## రష్యాతో ఇంధన ఒప్పందం చేసుకుంటాం



(మొదటి తరువాయి)

గమినిస్తున్నాం. అయితే.. నేను మరోసారి చెబుతున్నా మా దేశ ప్రజల ఇంధన అవసరాలే మాకు తొలి ప్రధాన్యం. అందుకని ప్రపంచ పరిస్థితులను బట్టి మార్కెట్లో అందుబాటులో ఉన్న వనరులను ఎంచుకుంటాం. ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం సరికాదని హెచ్చరిస్తున్నాం' అని జైస్వాల్ తెలిపారు. ఉక్రెయిన్‌తో రష్యా శాంతి చర్చలకు సిద్ధం కాకుంటే ఆ దేశ ప్రధాన వ్యాపార భాగస్వాములైన భారత్, బ్రెజిల్ చైనాలపై ట్రేడ్ టారిఫ్స్ తప్పవని నాటో చీఫ్ మార్క్ రుట్టే హెచ్చరించారు. అమెరికా సెనేటర్లతో సమావేశమైన తర్వాత ఆయన ఆంక్షల ప్రకటన చేయడం గమనార్హం. జూలై తొలి వారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం రష్యాతో ఆయిల్ ఒప్పందం చేసుకునే దేశాలపై వంద శాతం సెకండరీ టారిఫ్ భారం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్‌తో 50 రోజుల్లో శాంతి ఒప్పందం చేసుకోకుంటే తమ ఆగ్రహానికి బలికావాల్సి వస్తుందని ట్రంప్ మాస్కోకు అల్టిమేటం జారీ చేశారు.

## రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవు



(మొదటి తరువాయి)

మా కేటీఆర్‌కు లేదు. ఈ రాష్ట్రం కోసం, ప్రజల కోసం మేము భయపడం. ఏదో ఒకటి చేసి మా పైన కేసులు పెడితే మేము భయపడతాం అని రేవంత్ రెడ్డి అనుకుంటు-న్నాడు. మా పై తెలంగాణ ఉద్యమంలో 300 పైగా కేసులు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు. మా పైన ఇంటిలిజెన్స్ వ్యవస్థతో రేవంత్ రెడ్డి నిఘా పెడుతున్నాడు, మాకేం కాదు. రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను రోజూ ట్యాప్ చేస్తున్నాడు. మా వెనుక ఇంటలిజెన్స్ వాళ్ళను పెట్టి ఎక్కడ అంటే అక్కడ తిప్పుతున్నారు. మా చుట్టూ నిఘా పెట్టారు. మా అందరి ఫోన్స్ ట్యాప్ అవుతున్నవి. విలేకరుల ఫోన్ ట్యాప్ చేస్తున్నారా. నా తో విలేకరులు మాట్లాడేది ఎలా తెలుస్తుందని అన్నారు.

## నాపై డ్రగ్స్ కేసు నమోదైందా?

(మొదటి తరువాయి)

చెప్పాలి. నాపైన ఏమైనా కేసు నమోదైందా? కనీసం అణువంత రుజువైనా ఉన్నదా? ముఖ్యమంత్రికి దమ్ముంటే దొంగ చాటుగా చేసిన వ్యాఖ్యలపై ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసురుతున్నాను. లేకుంటే తాను చేసింది చౌకబారు, చిల్లర వ్యాఖ్యలు అని ఒప్పుకోవాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నాతో ముఖాముఖి చర్చకు వచ్చే దమ్ములేక ఢిల్లీ వరకు ప్రయాణం చేసి మరీ రేవంత్ రెడ్డి నాపై బురద జల్లుతున్నాడు. కేవలం చట్టం పరిధి నుంచి న్యాయస్థానాల పరిధి నుంచి తప్పించుకోవడానికే ముఖ్యమంత్రి చిట్‌చాట్‌ల పేరుతో దొంగచాటు మాటలు మాట్లాడుతున్నాడు. పిరికి దద్దమ్మలా చిట్‌చాట్‌ల పేరుతో నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాడు. వీటన్నింటినీ ఇకపై సహించేది లేదు.. రేవంత్ రెడ్డి చేసిన అసత్యపూరిత, దురుద్దేశపూర్వక నిందలకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రేవంత్ తాను చేసిన నిరాధార ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే పర్యావసనాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని కేటీఆర్ హెచ్చరించారు.

## బీఆర్ఎస్ వాళ్లు బీసీ ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారు

(మొదటి తరువాయి)

టైం తీసుకుంటారేమో అంతే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతును ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను మద్దతు ఇస్తునట్లు చెప్పారు. తనపై తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్స్ కు బీఆర్ఎస్ పార్టీ రియాక్ట్ కాలేదని.. దానిని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియా చిట్ చాట్ లో ఎమ్మెల్సీ కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ మధ్య దూరం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. అన్నాచెల్లాల మధ్య గ్యాప్ రావడానికి కారణాలు ఏంటి అనేది ఇప్పటికి ఇంకా తెలియరాలేదు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్.. కవితకు షాక్ ఇచ్చారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఇంఛార్జ్‌గా ఉన్న కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియమించారు. కేటీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం గులాబీ పార్టీలో, రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కవితకు పార్టీలో, అనుబంధ సంఘాల్లోనూ ప్రాధాన్యం తగ్గుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తాజాగా ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీపై చేసిన ఆరోపణలతో ఆ పార్టీకి, ఆమెకు దూరం పెరిగినట్లు కనిపిస్తోంది. అన్నపై ఉన్న కోపంతో కవిత ఈ వ్యాఖ్యలు చేశారనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నేతలు స్పందించకపోవడమనేది దారుణమని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. ఈ విషయం బిఆర్ఎస్ నేతల విజ్ఞతకే వదిలివేస్తున్నానని, తన దారికి భారత రాష్ట్ర సమితి నేతలు రావాల్సిందేనని స్పష్టం చేశారు. న్యాయ నిపుణులతో చర్చించిన తరువాతనే బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. రెండు బిల్లులు పెట్టాలని తొలుత డిమాండ్ చేసింది కూడా తానేనని తెలియజేశారు. బనకచర్లపై చర్చకు వెళ్లనని సిఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని, బుధవారం ఢిల్లీ సమావేశంలో ఎజెండాలో మొదటి అంశమే బనకచర్ల అని పేర్కొన్నారు. బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించడం మంచి పద్ధతి కాదని హితువు పలికారు. ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిపారని తెలియజేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే గోదావరి జలాలు హక్కులు తెలంగాణ రాష్ట్రం కోల్పోతుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు గోదావరి జలాలను ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేతిలో పెట్టారని దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు జరుగుతున్న నష్టం గురించి చెప్పడం లేదని కవిత చురకలంటించారు.

## బలూచి లిబరేషన్ దాడులు

(మొదటి తరువాయి)

పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటు-చేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడీ పేల్చి మరో ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్‌ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడీ పేల్చి నలుగురు సైనికులను , బుధవారం గుడ్రోకొర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు- బీఎల్‌ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు- చెప్పింది. సమీపంలోని సైనిక కాన్వాయ్‌ను స్నైపర్లు లక్ష్యంగా చేసుకోవడంతో.. ఆ కాన్వాయ్ అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇక ముగ్గురు బీఎల్‌ఏ దళ సభ్యులు చనిపోయినట్లు- వచ్చిన వార్తలను ఖండించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ బలోచ్ రెబల్స్ మొత్తం 286 దాడులు చేశారు. ఈ క్రమంలో వివిధరకాల వ్యూహాలను అమల్లోకి తెచ్చారు. వీటిల్లో మూడు ఆత్మాహుతి దాడులు ఉన్నాయి. బీఎల్‌ఏ చేసిన మొత్తం దాడుల్లో 700 మందికి పైగా చనిపోయారు. 290 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు- బీఎల్‌ఏ చెబుతోంది. ఈ క్రమంలో 133 వాహనాలను లక్ష్యంగా చేసుకొంది. ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసింది. దీంతోపాటు- ఈ ఏడాది మొత్తం 45 వ్యూహాత్మక ప్రాంతాలను పాక్ నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు- గణాంకాలు చెబుతున్నాయి.

## ఉనికి చాటుకునేందుకు హరీష్ యత్నం

(మొదటి తరువాయి)

ఘాటుగా స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మీటింగ్‌లో ఏయే అంశాలు మాట్లాడారో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా కూడా హరీష్ రావు మెదడుకు ఎక్కనట్టు ఉంది అంటూ సెటైర్ విసిరారు. హరీష్ అడ్డగోలు వాదనతో, అర్థం లేని తర్కంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. సీఎం మాట్లాడగానే ఏదో ఒకటి మాట్లాడి తన ఉనికిని చాటు కోవాలన్న తపన తప్ప హరీష్ రావుకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు సవాల్ విసిరారన్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనండి లేదా తామే ఫామ్ హౌస్‌కు వచ్చి అక్కడ మాక్ అసెంబ్లీ పెడుతాము పాల్గొనండి అని సవాల్ చేస్తే అక్కడ నుంచి నోరు లేవలేదన్నారు. మళ్ళీ సిగ్గు లేకుండా సవాళ్ల గురించి మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రాజెక్టులు కట్టుకున్నా సమస్య లేదు. రాయలసీమను రతనాల సీమ చేస్తాను. బెసిన్లు లేవు, భేషజాలు లేవు అని కేసీఆర్ అంటేనే కదా ఈరోజు వాళ్ళు బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు కడుతున్నది. తెలంగాణకు ద్రోహం చేసి మళ్లీ మీరే సిగ్గులేకుండా కాంగ్రెస్ మీద, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు దమ్ముంటే అసెంబ్లీలో పెట్టే చర్చలకు నువ్వు, మీ మామ కేసీఆర్ వచ్చి మీ వాదన చెప్పండని సవాల్ చేశారు. అప్పుడు ఎవరు ఏంటో తెలుస్తుందని అన్నారు. ప్రెస్‌మీట్‌లు పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకుదామని చూస్తే జనం నమ్మరంటూ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వాదనలు కట్టిపెట్టాలని అన్నారు. బిఆర్ఎస్ నేతలు తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి పసలేని వాదనలు చేస్తున్నారని మహేశ్ కుమార్ అన్నారు.

## బీహార్‌లో నితీష్ ఉచిత వల

(మొదటి తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన వారికి ప్రభుత్వం తగిన మద్దతును అందిస్తుందని తెలిపారు. అంటే గృహ వినియోగదారులు ఇకపై 125 యూనిట్ల వరకు విద్యుత్ కోసం ఎటు-వంటి ఖర్చు భరించాల్సిన అవసరంలేదని, రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 10,000 మెగావాట్ల వరకు సౌరశక్తి అందుబాటు-లో ఉంటుందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నేత, మాజీ డిప్యూటీ- సిఎం తేజస్వీయాదవ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తమ నేత 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమని ప్రకటించడంతో బీహార్ సిఎం నితీష్‌కుమార్ దిగిరావాల్సి వచ్చిందని ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి సింగ్ యాదవ్ ఏద్దేవా చేశారు.

## కేంద్ర మంత్రి బండికి సిట్ నోటీసులు

(మొదటి తరువాయి)

వ్యూ గెస్ట్ హౌజ్ లో స్టేట్ మెంట్ ఇచ్చేందుకు బండి సంజయ్ అంగీకరించారు. అదేరోజు పీఆర్వో మధు, పీఏ ప్రవీణ్ ల స్టేట్ మెంట్‌ను రికార్డ్ చేయనున్నారు. గురువారం కేంద్ర మంత్రి నివాసానికి వచ్చిన సిట్ అధికారులు నోటీసులందించారు. కొద్దిరోజుల క్రితమే బండి సంజయ్ వ్యక్తిగత డ్రైవర్ రమేశ్ ను పిలిచి స్టేట్ మెంట్ రికార్డు చేశారు. కాగా.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ పార్టీలకు చెందిన ఫోన్లను గత ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముఖ్య నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో సిట్ పలువురు నేతలను పిలిచి వాంగ్మూలం తీసుకుంటోంది. తాజా బండి సంజయ్ స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేయనుంది. గురువారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

## ఉపాధి హామీ లో దక్షిణాదిలో ఏపీ ఆదర్శం

(మొదటి తరువాయి)



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాయని వెల్లడించారు. ఇక, ఉపాధి ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతుండటంతో, రాష్ట్రంలోని గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. అధికారుల పని తీరును ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్ ద్వారా సమీక్షిస్తూ, నాణ్యతా తనిఖీలు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించడం వల్ల ఇతర రాష్ట్రాల అధికారులు కూడా ఆంధ్రప్రదేశ్ పని తీరును మెచ్చుకుంటు-న్నారని పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

## 2025 జూలై 18, శుక్రవారం తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**
**మాసం:** ఆషాఢమాసం (అమాంత)
**పక్షం:** కృష్ణపక్షం
**తిథి**
**ద్వితీయ:** జూలై 17 సా. 4:34 నుంచి జూలై 18 సా. 3:52 వరకు
**తృతీయ:** జూలై 18 సా. 3:52 నుండి జూలై 19 సా. 2:51 వరకు
**నక్షత్రం**
**హస్త:** జూలై 18 ఉదయం 5:00 వరకు
**చిత్త:** జూలై 18 ఉదయం 5:00 నుండి
జూలై 19 ఉదయం 4:47 వరకు
**శుభ సమయాలు**
**బ్రహ్మ ముహూర్తం:** ఉదయం 4:20 -5:06
**అభిజిత్ ముహూర్తం:** మధ్యాహ్నం 12:01 -12:52
**అశుభ సమయాలు**
**రాహుకాలం:** ఉదయం 10:47 -12:24
**యమగండం:** మధ్యాహ్నం 3:37 -5:14
**దుర్ముహూర్తం:** ఉదయం 8:25 -9:18
**వర్జ్యం:** సాయంత్రం 5:46 - రాత్రి 7:33

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**ఎలిగేడు, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్**
ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామానికి చెందిన ముద్ర వేణి నరేష్ (34) అనే వ్యక్తి మద్యం మత్తులో గడ్డి మందు సేవించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గత కొంతకాలంగా మద్యం వ్యసనంతో బాధపడుతున్న నరేష్, 15 మే 2025న సాయంత్రం మద్యం సేవించి గడ్డి మందు తాగినట్టు భార్యకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.వెంటనే అతన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున 4.35కి మృతి చెందినట్లు ఎలిగేడు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని ఎస్ఐ వివరించారు.

# ఘనంగా బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమం



**జిల్లెలగూడ, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బోనాల పండుగను పురస్కరించుకుని చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు అర్కల వేణుగోపాల్, టీయుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పందులు వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాచూరులో టీచర్ల కొరతపై పీడిఎస్యు నేత ఆందోళన



**వెల్దండ, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని రాచూరులో విద్యా సమస్యలు రోజు రోజు కీ తీవ్రతరం అవుతున్నాయి. పి.డి.ఎస్యూఅధ్వర్యంలో అక్కడి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశమై, విద్యా సదుపాయాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాచూరులో మ్యాథ్స్, సోషల్ స్టడీస్ వంటి ముఖ్యమైన సబ్జెక్టులకు టీచర్లు లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. అంతేకాక, జిహెచ్ఎం పోస్టు కూడా ఖాళీగా ఉంది. వెంటనే వెల్దండ ఎంఈఓ, నాగర్‌కర్నూల్ జిల్లా డీఈఓ స్పందించి టీచర్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు విజయ్ కుమార్, నితిన్, మల్లేశ్, కార్తీక్, రామ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# 12.28 కోట్లతో కొంపల్లిలో అభివృద్ధి పనులు



**కుత్బుల్లాపూర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీలో 12.28 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ చొరవతో మంత్రివర్యులు దుద్ధిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లిన పలు అభ్యర్థనలపై బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజ్, చెరువు సుందరీకరణతో పాటు మౌలిక సదుపాయాలకు నిధులు ఆమోదించారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ దూలపల్లిలోని కాలనీలు, ఊర చెరువును పాదయాత్రగా సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జిమ్మి దేవేందర్ నివాసంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో అభివృద్ధి వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# హైదర్‌నగర్‌లో కొనసాగుతున్న రోడ్ల మరమ్మతులు




**హైదర్‌నగర్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్‌లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ డ్రైవ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు స్వయంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడారు. వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడటం లక్ష్యంగా, క్యాచ్‌పిట్‌ల మరమ్మతులు, సెంట్రల్ మీడియన్‌లకు చిన్నపాటి పనులు వేగంగా పూర్తిచేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ డ్రైవ్‌ను ఒక వారం వ్యవధిలో ముగించాలన్న లక్ష్యంతో, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం నాణ్యమైన పదార్థాలతో పనులు నిర్వహిస్తోంది. ప్రజలు తమ ప్రాంత రోడ్ల సమస్యలను 155304 హెల్ప్‌లైన్ లేదా మై జిహెచ్ఎంసి యాప్ ద్వారా తెలియజేయవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, జిహెచ్ఎంసి సిబ్బంది, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొని అభివృద్ధిలో తమ భాగస్వామ్యాన్ని చూపించారు. ప్రజల సహకారంతో నగర రోడ్లు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు.

# విద్యార్థులకు ప్రోత్సాహంగా కేశ్య నాయక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమం



**మాడుగుల, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాడుగుల మండలంలోని పల్లెతాండా, అందుగుల, కూబ్య తండా, ఆసిరెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ శ్రీ కేశ్య నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూర్య నాయక్ స్వయంగా పాలుపంచుకుని, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, డిక్షనరీలు, స్టేషనరీ కిట్స్ అందజేశారుపేద విద్యార్థులకు అండగా ఉండేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చిన సూర్య నాయక్ ఈ పథకం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె. నాను, వి. హున్యా నాయక్, చంప్లి బాయి, స్కూల్ హెడ్మాస్టర్, టీచర్లు, గ్రామపంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతిరెడ్డి కి ఉత్తమ సేవల పురస్కారం



**హైదరాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్**
ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా, ఆమనగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెచ్ఈఓ తిరుపతిరెడ్డికి ఉత్తమ సేవల పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ కామినేని మెడికల్ కళాశాలలో నిర్వహించబడింది.డీఎంఅండ్‌హెచ్ఓ డా. వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. గీత తదితరులు తిరుపతిరెడ్డిని ప్రశంసా పత్రం మరియు మెమొంటో తో సత్కరించారు.

# అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

## మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు



**ఆమనగల్లు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు పేర్కొన్నారు. గురువారం చంద్రాయన్‌పల్లి తండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రారంభ దశ పూర్తయిన ఇంటికి రూ. లక్ష రుసుము లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 35 ఇండ్ల నిర్మాణం జరుగుతోందని, అదనంగా మరో 1000 ఇండ్లు త్వరలో మంజూరుకానున్నాయని వెల్లడించారు.ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం తదితర పథకాలపై ప్రచారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# హై టెన్షన్ వైర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం



**షాద్ నగర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చేగూరు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా బాధించి వచ్చిన విద్యుత్ హై టెన్షన్ వైర్ల సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి చొరవతో ప్రమాదకరమైన వైర్లు తొలగించబడి, గ్రామస్తులకు సురక్షిత జీవనం కలుగగా, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ సహకారంగా విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం జరిగింది.ఈ నేపథ్యంలో, చేగూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యే గారిని క్యాంప్ కార్యాలయంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. వారిలో మంకాల శ్రీశైలం, ఆవుల శివ శంకర్, ధరూర్ సతీష్ పటేల్, కావాలి భీమయ్య, గునుగుర్తి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

# జనాభా దినోత్సవ అవార్డులు

## షాద్‌నగర్ వైద్యులకు ఘన సత్కారం




**షాద్‌నగర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కామినేని ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డా. బి. వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో షాద్‌నగర్ డివిజన్ వైద్యులకు ఉత్తమ సేవల పురస్కారాలు అందజేశారు.ప్రతి క్యాడర్‌లో విశిష్ట సేవలందించిన ఒకొక్కరిని ఎంపిక చేసి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డా. విజయలక్ష్మి, డా. నికిత, నాగేశ్, శ్రీనివాసులు, లుదియా, చంద్రకళ, రాజశేఖర్, సునీత, వెంకట ముని, స్వప్న, రాధిక లాంటి ప్రతిభావంతులకు అవార్డులు ప్రదానం చేశారు.సేవల పట్ల కృషిని గుర్తించిన ఈ వేడుక వైద్య సిబ్బందికి కొత్త ఉత్సాహాన్ని నింపిందని అధికారులు తెలిపారు.

# ఉచిత విద్యుత్ కోసం కొత్త రేషన్ కార్డుదారులు ఇలా చేయండి


**మక్తల్ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది అయితే కొత్తగా రేషన్ కార్డులు పొందినవారు ఈ పథాకాన్ని పొందేందుకు విద్యుత్ బిల్లులోని కస్టమర్ ఐడీకి ఆధార్ కార్డును అనుసంధానం చేసి అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసి నింపాలి తర్వాత స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పట్టణ ప్రాంతాలు గ్రామ పంచాయతీ కేంద్రాల్లోని అధికారులకు దాన్ని సమర్పించాలి

# మహిళా శక్తికి దిశా నిర్దేశం

- ఇందిర మహిళా శక్తి సంబురం,ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**తిమ్మాపూర్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో నిర్వహించిన ఇందిర మహిళా శక్తి సంబురానికి ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, మహిళలు ఆర్థికంగా స్వావలంభన సాధించి జగతికి జీవన జ్యోతులు కావాలని ఆకాంక్షించారు.మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యత అప్పగిస్తుండడం, వడ్డీ లేని రుణాల సహాయంతో కోటీశ్వరుల దిశగా ప్రభుత్వ ప్రణాళికలు అమలవుతున్నాయని ఆయన వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి విరుద్ధంగా, కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో మహిళల అభివృద్ధికి పని చేస్తోందన్నారు.అంతేగాక, కొండపలకల గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలనలో, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్‌కు మంజూరైన ఇంటిని సందర్శించి పూర్తి భరోసా కల్పించారు. పార్టీ బేధం లేకుండా అర్హత ఆధారంగా 270 మందికి ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులూ పాల్గొన్నారు. మానవత్వమే ముఖ్యం అనే సందేశాన్ని అందిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నదనే సంకేతం స్పష్టంగా కనిపించింది.

## నిమిష ప్రియ మరణశిక్షపై స్పందించిన
# భారతీయ విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేరళ నర్సు నిమిష ప్రియ కు చెందిన కేసు చాలా సున్నితమైన అంశం అని, మరణశిక్షను తప్పించేందుకు ప్రభుత్వం వీలైనంత సాయం చేస్తోందని కేంద్ర విదేశాంగ ఇవాళ పేర్కొన్నది. యెమెన్ దేశస్థుడిని హత్య చేసిన కేసులో ఆ దేశం ఆమెకు మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈనెల 16వ తేదీన నిమిష ప్రియను ఉరితీయాల్సి ఉంది. కానీ ఆ నిర్ణయాన్ని యెమెన్ దేశం వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఇవాళ భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ.. నిమిష ప్రియ కేసు కోసం కొన్ని స్నేహపూర్వక దేశాలతో టచ్‌లో ఉన్నట్లు తెలిపింది. చాలా క్లోజ్‌గా ఆ అంశాన్ని ఫాలో అవుతున్నామని, అన్ని రకాల సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్థాకి అధికారులతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.తలాల్ అబ్దో మెహదీని 2017లో హత్యచేసిన భారతీయ నర్సు నిమిష ప్రియకు క్షమాభిక్ష ప్రసాదించాలని లేదా నష్టపరిహారం తీసుకోవాలని(బ్లడ్ మనీ) వస్తున్న ప్రతిపాదనలను తమ కుటుంబం అంగీకరించే ప్రసక్తి లేదని బాధిత సోదరుడు అబ్దెల్ ఫత్తా మెహదీ స్పష్టం చేశారు. షరియా చట్టం ప్రకారం ప్రతీకార న్యాయం(కిసాస్) కావాలన్న తమ డిమాండును ఆయన మరోసారి పునరుద్ఘాటించారు. చేసిన నేరానికి నిమిషను ఉరితీయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

# ఎనిమిదోసారి క్లీన్ సిటీగా నిలిచిన ఇండోర్..

- స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు అందజేసిన రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరం మరోసారి మొదటి స్థానంలో నిలిచింది. స్వచ్ఛ నగరాల జాబితాలో ఇండోర్ తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇలా ఈ నగరం మొదటి స్థానంలో నిలవడం ఇది ఎనిమిదోసారి కావడం విశేషం. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆ నగరానికి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డును అందజేశారు. ఇక రెండో స్వచ్ఛమైన నగరంగా సూరత్, మూడో స్థానంలో ముంబై మహా నగరం నిలిచింది.కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 -25 అవార్డులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవాళ ప్రదానం చేశారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన వేడుకల్లో 'స్వచ్ఛ' జాబితాలో నిలిచిన నగరాలకు అవార్డులను ప్రదానం చేశారు. కేంద్రం ప్రకటించిన ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీలోని ఐదు నగరాలకు చోటు దక్కింది. విశాఖపట్నం జాతీయస్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డు దక్కించుకుంది. రాజమహేంద్రవరానికి రాష్ట్రస్థాయిలో మినిస్టీరియల్ అవార్డు లభించింది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, తిరుపతి, గుంటూరు ఎంపికయ్యాయి.





## సచివాలయంలో లో కన్నుల పండుగగా
# బోనాల ఉత్సవాలు

**తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు**
**అసోసియేషన్ పబ్లిసిటీ సెక్రటరీ రాజేష్ నృత్యం...**

**సెక్రటేరియట్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిత్యం వృత్తి రీత్యా బిజీబిజీగా గడిపే సచివాలయ ఉద్యోగులు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోగా, మిగతా ఉద్యోగులు తలపాగాలతో ప్రభుత్వ పరిపాలన విభాగంలో రాష్ట్రానికే తలమానికమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ లో బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివరాలలోకి వెళ్తే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సచివాలయంలో శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు కన్నుల పండుగగా గురువారం జరిగాయి. సచివాలయ మహిళా ఉద్యోగులు రంగురంగుల సాంప్రదాయ వస్త్రాలంకరణలతో అందంగా ముస్తాబు చేసిన



బోనాలను ఎత్తుకొని, ఊరేగింపుగా వెళ్లగా. బ్యాండ్ చప్పుళ్ళు , డప్పు వాయిద్యాలు, పోతురాజుల వీరంగం తో కదిలిరాగా, సచివాలయ నాయకులు మరియు ఉద్యోగులు తమ నృత్యాలతో అలరించగా, అసోసియేషన్ పబ్లిసిటీ సెక్రటరీ రాజేష్ నృత్యం ఆకట్టుకుంది. పలహారం బండి ఊరేగింపు నార్త్ పోర్టికో నుండి మొదలై అమ్మవారి చెంతకు చేరేవరకు ఉద్యోగులందరూ కలిసిమెలిసి ముందుకు సాగారు. వివిధ కళాకారుల నృత్యాలు అక్కట్టుకున్నాయి. శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి దేదీప్యమానంగా నైవేద్యం సమర్పించిన సచివాలయ ఉద్యోగులు తదనంతరం ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్, ట్రెజరర్ కైలాష్, వైస్ ప్రెసిడెంట్ నవీన్ మరియు ఆఫీస్ బేరర్స్, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ సభ్యులు, సచివాలయంలోని వివిధ శాఖలలో వివిధ హోదాలలో పనిచేసే అధికారులు ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## పిల్లలతో రోజూ పదినిమిషాలు
# భవిష్యత్తుకి బంగారు బాట! ??

## తల్లిదండ్రులు తపించాల్సిన సత్యం





వారు పుట్టగానే మన జీవితంలో వెలుగులు పుట్టాయి కానీ వారిని తీర్చిదిద్దే ప్రక్రియలో తల్లిదండ్రులది కీలక పాత్ర. పిల్లల చదువు, ప్రవర్తన, జీవితంపై దృక్పథం అన్నీ ం పాఠశాలలో కాదు ఇంట్లోనే అలవడతాయి. అయితే నేటి కాలంలో ఉద్యోగ బిజీ, సమయపు కొరత మధ్య పిల్లలపై దృష్టి సడలిపోతోంది. ప్రేమ ఉన్నా మన సమయానికి వాళ్లు బాధితులవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి సూచన ప్రతి తల్లిదండ్రి గుండెను తాకే సందేశం.

రోజుకి పదినిమిషాలు - పిల్లల జీవితాన్ని మార్చే మంత్రం!

**పిల్లల పట్ల తల్లిదండ్రుల 10 నిమిషాల మాయ:**

-నాణ్యత గల సంభాషణ
- ప్రశంసలతో కూడిన ప్రేరణాత్మక మాటలు
- చిన్న లక్ష్యాల ద్వారా ఆత్మనిర్భరతకు ప్రేరణ
- స్క్రీన్ టైమ్ తగ్గించే ఆకర్షణీయమైన మార్గాలు (ఆటలు, పుస్తకాలు, వ్యాయామం)

ఈ నాలుగు మెట్లు ఎక్కిన పిల్లలు

- స్వయంగా చదవడం ప్రారంభిస్తారు
- హోంవర్క్‌ను పూర్తి చేస్తారు
- మోస్తరు ప్రవర్తన కనబరుస్తారు
- డిజిటల్ వ్యసనాల నుంచి దూరంగా ఉంటారు
- తల్లిదండ్రులపై గాఢమైన అనుబంధం పెంపొందించుకుంటారు

ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సింది ఏమిటంటే పిల్లలపై అరవడం లేదు, బలవంతం చేయడం లేదు, పదే పదే చెప్పడం లేదు. మార్పు బలవంతంగా కాదు%ॅ% ప్రేమతో కలిసిన అవగాహనతో వస్తుంది.

**"గారాబం కాదు - మార్గనిర్దేశం అవసరం"**

తల్లిదండ్రులు కొందరు పిల్లలపై గారాబంతో మౌనంగా మెలుగుతారు. కొందరు అధిక శాసనంతో భయపెట్టేందుకు చూస్తారు. కానీ ఇది తాత్కాలిక శాంతికి దారి తీస్తుంది. "పిల్లలలో శాశ్వత మార్పు రావాలంటే అవగాహన కలిగించాలి" అని గోపాల్ రెడ్డి గారు సూచిస్తున్నారు. మర్యాదగా, బుద్ధిగా, వ్యక్తిత్వాన్ని గౌరవిస్తూ మార్గనిర్దేశం చేస్తే పిల్లలు తమ లక్ష్యాలను తాము అర్థం చేసుకుని స్వయంగా ముందుకు సాగతారు.

**ఒక పదినిమిషాల మార్పు ఒక జీవితాంతం ప్రభావం!**

ఇది సాధ్యమే అందరూ చేయగలిగేది. ఈ మార్గాన్ని ప్రతి ఇంటిలో అనుసరిస్తే ం చదువు ఒత్తిడిగా కాకుండా ఆనందంగా మారుతుంది. ప్రతి తల్లి తండ్రి కూడా తాము పిల్లలకు ఇచ్చే ఉత్తమ బహుమానం రోజుకి 10 నిమిషాలు అని గుర్తుంచుకోవాలి.

**వ్యాసకర్త**
-------------------
లయన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి
చైర్మన్ - లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్
జాతీయ సలహాదారు - TRSMA, NISA,
పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి



# "సేవాజ్యోతి 2025 " మరియు"సేవారత్న అవార్డ్స్ అందుకున్న డా.నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్

పాలమూరు,జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)
వివిధ రంగాలలో సేవలు అందించినవారికి హైదరాబాద్ లోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయములో అల్లూరి సీతరామరాజు మెమోరియల్ ఆర్గనైజెషన్ "సేవాజ్యోతి పురస్కారం 2025 " మరియు సేయింట్ మదర్ థెరిసా సోషియల్ వెల్ఫేర్ ఆర్గనైజెషన్ "సేవారత్న అవార్డ్స్ 2025 " తో అవార్డు, సర్టిఫికెట్ మరియు మెడల్స్ తో దాదాపుగా 20 మందిని సత్కరించడం జరిగినది. పాలమూరుకు చెందిన డా.నిచ్చనమెట్ల రాజేంద్రప్రసాద్ ఈ అవార్డ్స్ ను తన తల్లి వరలక్ష్మి కలసి తో తీసుకోవడం జరిగినది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతములో కూడా వివిధ సంస్థలవారు మా స్వచ్ఛంద సేవలను గుర్తించి అవార్డ్స్ ఇవ్వడం జరిగింది. ఇలాంటి అవార్డు తీసుకోవడం ద్వారా మాకు సమాజములో ఒక గుర్తింపుతో పాటు, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవాకార్యక్రమాలను ఎక్కువగా చేయాలనే ఒక సంకల్పంను మాకు కలిగిస్తుంది. అలాగే వివిధ




జిల్లాల నుంచి వచ్చిన వారితో కలవడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డు తీసుకోవడానికి మొదటగా నాకు జన్మనిచ్చిన మా అమ్మానాన్నకు, గురువులకు పాదాభివందనాలు తెల్పుతూ అవార్డు ఇచ్చిన సంస్థలకు, ఇక్కడి విచ్చేసిన వారందరికీ ధన్యవాదములు తెలుపుకుంటూ, మనిషి అనేవాడికి ఎన్ని ఆస్తులు అంతస్థులు, డబ్బు, హొదా వున్న. పుట్టుక మరియు మరణం అనేవి తప్పదు. ఈ జనన మరణాల మధ్య సాగే జీవితము కేవలం నీటిమీద బుడగలాంటిదే అని అన్నారు. ఒక సగటు సామాన్య మనిషి మరియు ఎంత కోటీశ్వరులకు అయిన మొదటగా కావలసింది కుడు, గుడ్డ, గూడు. దాదాపుగా చాలా మంది ఒకపూట భోజనాలు చేయలేక ఆకలి కడుపుతో పస్తులు వుంటున్నారు.అలాంటి కొంతమందికి మా అమ్మగారు స్వయంగా చేసిన ఆహారంతో మాకు వున్న దానిలో కొందరి ఆకలి తీర్చడం జరుగుతున్నది.మేము ఇప్పటి వరకు ఆకలితో వున్నవారికి ఆహారంను, మరి కొందరికి బట్టలను అందించడం జరిగింది. అదేవిదంగా మహబూబ్ నగర్ లో వున్న కొన్ని అంగన్వాడీ కేంద్రములకు మరియు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాదాపుగా 1500 ల తెలుగు, హిందీ, ఆంగ్లము మరియు టేబుల్ పటాలను అందించడం జరిగినది. కరోనా సమయంలో 13 రకాల నిత్యావసర వస్తువులను పేదవారికి అందించడం మరియు ఎగ్జామ్స్ పాడ్, పెన్నులను అందించడం జరిగిందని.ఈ కార్యక్రమం లో కృష్ణమూర్తి,బొగ్గారాపు బ్రహ్మానందం, రాయపూడి రమేష్, దోసపాటి కళ్యాణ్ రావు గారు, పి శ్రీనివాస రావు గారితో పాటు దాదాపుగా 60 మంది పాల్గొన్నట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు.


# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

లక్ష్యం

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

మిషన్

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness


# అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు

- ఆరుట్లలో చురుగ్గా కొనసాగుతున్న ఇండ్ల నిర్మాణాలు
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



మంచాల,జూలై 17 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)
అర్హులైన పేదలందరి కీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు ఆరుట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ వరకు నిర్మాణం పూర్తి చేసిన రావుల మహేష్ s/o వెంకటయ్య ఇల్లు నిర్మాణ పనులను ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.నిరుపేదలు ఇల్లు కట్టుకోవాలని కన్న కలలు గత 10 సంవత్సరాలలో నెరవేరలేదని అన్నారు. ఆనాటి ప్రభుత్వం ఇండ్ల నిర్మాణం చేయలేదని, ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురు చూశారని, అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ఇల్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ మార లక్ష్మణ్ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్ చిందం ఐలయ్య ఆర్ల మల్లేష్ ఆర్ల శ్రీకాంత్ చీమర్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు




సికింద్రాబాద్,జులై 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
క్లీనెస్ట్ కంటోన్మెంట్ బోర్డుల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు తొలి స్థానాన్ని సంపాదించుకుంది. పరిశుద్ధత, పచ్చదనం, చెత్త సేకరణ, మరెన్నో పర్యావరణ సంబంధ విషయాల్లో కంటోన్మెంట్ బోర్డుకు మంచి గుర్తింపు పొందింది. తాజాగా జాతీయస్థాయిలో మినిస్టీ రియల్ విభాగంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 అవార్డుకు ఎంపికైంది. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును కేంద్ర పట్టణ వ్యవహారాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, జాయింట్ సీఈఓ పల్లవి, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్, బోర్డు అధికారి దేవేందర్ లు అందుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు ఎంపిక కావడానికి సేవాస్థాయి పురోగతి, నాణ్యమైన చెత్త సేకరణ, ప్రత్యేకంగా వాహనాల నిర్వహణ, పారిశుద్ధ్య పనితీరు, సర్టిఫికేషన్ విధానంతో పాటు పలు అంశాలలో తీసుకున్న నిర్ణయాల్లో ప్రజలు భాగస్వామ్యం కావడం, వారిని చైతన్య పరిచే కార్యక్రమాలు చేపట్టడం, స్వచ్ఛ యాప్ ఉపయోగించడం వంటి అంశాలు కంటోన్మెంట్ అవార్డుకు ఎంపిక కావడంలో ప్రధానంగా ఉన్నాయి. కంటోన్మెంట్‌కు అవార్డు రావడంపై కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఇందులో బోర్డు ప్రజల ఐక్యత, వారి భాగస్వామ్యం ప్రధాన పాత్ర పోషించాయని, అభివృద్ధి, అవార్డుల్లో వారు ఎంతో స్ఫూర్తిని చాటుతున్నారని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కడంపై బోర్డు ప్రజలకు అభినందనలు తెలిపారు.


# ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు

- సీసీటీవీ పర్యవేక్షణలో రూ.1.13 కోట్ల జరిమానాలు



కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన 769 సీసీటీవీ కెమెరాలు జూన్ 27, 2025 నుండి పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. ఇవి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను పర్యవేక్షిస్తూ, తగినపరిధిలో చలాన్లు జారీ చేయడానికి ఉపయోగపడుతున్నాయని పోలీసు కమిషనర్ పేర్కొన్నారు. నగర ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఇది కీలకంగా మారుతోంది. ఇప్పటికే గత 20 రోజుల్లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 13,869 కేసులు నమోదయ్యాయి. వీటికి సంబంధించి రూ.1,13,43,400 జరిమానాలు విధించబడ్డాయి. ముఖ్యంగా ట్రిపుల్ రైడింగ్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, రాంగ్-సైడ్ రైడింగ్ వంటి అంశాల్లో అధికంగా కేసులు నమోదయ్యాయి. మొదటి రోజే హెల్మెట్ లేకుండా ప్రయాణించిన 955 మంది వాహనదారులపై రూ.95,500 జరిమానా విధించడం గమనించదగినది. అత్యవసరాల వల్ల శంగా ఓవర్ స్పీడ్, హెల్మెట్ నిబంధనలపై చలాన్లు నిలిపివేసినట్టు కమిషనర్ తెలిపారు. త్వరలో ఇతర శాఖల సమన్వయంతో వీటిని కూడా క్రమబద్ధీకరిస్తామని స్పష్టం చేశారు. పౌరుల భద్రత కోసం తీసుకుంటున్న ఈ చర్యల్లో భాగంగా పట్టణ వాసులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించి, పోలీసు శాఖకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, ఇన్‌స్పెక్టర్లు ఖరీముల్లా ఖాన్, రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నేతలు



హైదరాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)
హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ రామ్ చందర్ రావు గారిని ఈ రోజు కందుల సంధ్యారాణి, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పార్టీ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చ సాగగా, రాష్ట్ర అధ్యక్షుడి నాయకత్వ ధోరణిపై హర్షం వ్యక్తమైంది. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్న పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ ముదిరాజ్, తోట కుమార్ స్వామి, ముసుకుల భాస్కర్ రెడ్డి, కోడూరి రమేష్ మరియు మండల అధ్యక్షులు బోడకుంట సుభాష్, మెరుగు నరేష్, గుండబోయిన భూమయ్య, మిట్టపల్లి సతీష్, ఊరగొండ అపర్ణ, మామిడి వీరేశం, అందే రాజు, క్యాతం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులపల్లి ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన టి సంగీత

మాడుగులపల్లి/ నల్గొండ/జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఈరోజు మాడుగుల పల్లి మండలం ఎంపీడీవో గా టి సంగీత గురువారం రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పుష్పంగిచ్చి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండలంలోని ప్రజలకు ప్రతి గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తానని తెలియజేస్తూ నా పరిధిలో ప్రజలకు న్యాయం చేస్తానని అన్నారు. మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు నాయకులు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. నాకు ఈ బాధ్యతలు ఇచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.

- ఆర్కేపి ఆటో యూనియన్.

మంచిర్యాల జిల్లా.
మున్సిపాలిటీలోని మూడోవార్డు కనక దుర్గాకాలని నివాసి, పట్టణంలో సీనియర్ ఆటోడ్రైవర్, నిరుపేద కుటుంబానికి చెందిన కొండ్రురవి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందడం జరిగింది. మృతుడు రవి స్వగృహంలో గురువారం నిర్వహించిన దశదిన కర్మకు ఆర్కేపి ఆటో యూనియన్ మిత్రులు హాజరయ్యారు. మృతుడు కొండ్రు రవి చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు. అనంతరం మానవతా దృక్పథంతో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, అధ్యక్షుడు ఎనగంటి సంపత్ చేతుల మీదుగా 10,000/ రూపాయల నగదును కొండ్రు రవి కుటుంబ సభ్యులకు



అందజేసి,మనో ధైర్యాన్ని కపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పాక అంజయ్య,జెనరల్ సెక్రెటరీ జీడి రవి,చెన్నాల సారయ్య,మైకెల్ రాజు, ముల్కల నర్సయ్య, అలుక పున్నం, వాసం సధి, పప్పి మహేష్,తదితరులు పాల్గొన్నారు.

# పడమటి తండా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం





మహేశ్వరం,జులై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం పడమటి తండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో... బీజేవైఎం మహేశ్వరం ఉపాధ్యక్షులు కాట్రావత్. వినోద్ రాథోడ్, ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి.. గ్రామంలో ఉన్న పెద్దలు భారీ సంఖ్యలో తరలి రావడం జరిగింది. వైద్యులు ప్రతి ఒక్కరిని సమస్యలు అడిగి తెలుసుకోవడం మరియు ఉచిత వైద్య శిబిరంతో పాటు రక్తం దాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువకులు ముందుకొచ్చి రక్తదానాన్ని ఇచ్చి.. ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రతి ఒక్కరికి వైద్యం నిర్వహించినట్లుగా బీజేవైఎం మహేశ్వరం ఉపాధ్యక్షులు కాట్రావత్ వినోద్ రాథోడ్ తెలియజేశారు.. అనంతరం కాట్రవద్ వినోద్ రాథోడ్ డాక్టర్లను ఘనంగా సన్మానించారు చంద్రశేఖర్, శశికాంత్, నరేష్, ఈ యొక్క కార్యక్రమంలో గ్రామపంచాయతీ.. లో ఉన్న పెద్దలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది పి. తావు, కే కృష్ణ పి సురేష్ పి భాస్కర్ ఎన్. రాజు పి రవి ఏ కృష్ణ కే మోహన్ కె. హరిచంద్ర వి శ్రీను తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు బీజేవైఎం మహేశ్వరం మండల్ ఉపాధ్యక్షులు కాట్రవత్. వినోద్ రాథోడ్ ప్రతి ఒక్కరికి మరియు ఆర్కాన్ ఆస్పత్రి యజమానానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

# జల్ పల్లిలో పెద్దల సమక్షంలో.. బోనాలపండుగ తీర్మానం

## జులై 24న మరియు 27న జల్ పల్లి గ్రామంలో బోనాలు



జెల్ పల్లి జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ )
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం జెల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని జల్ పల్లి గ్రామంలో కోట మైసమ్మ సమీపంలో గ్రామ పెద్దల సమక్షంలో ఈనెల తేదీ 24 నాడు కట్ట మైసమ్మ బోనాలు తేదీ 27 నాడు గ్రామ బోనాలు జరుపుకోవాలని గ్రామ పెద్దలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆటపాటలతో బోనాలు జరుపుకోవాలని గ్రామ పెద్దలు.విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో. 16 వార్డు మాజీ కౌన్సిలర్ బుడుమల యాదగిరి. మాజీ ఎంపిటిసి దూడల శ్రీనివాస్ గౌడ్. మాజీ ఎంపిటిసి యంజాల జనార్ధన్. మరియు గ్రామ పెద్దలు దూడల కృష్ణ గౌడ్ యంజాల సురేష్. యంజల సుదర్శన్. కే విట్టల్ బాబా. వై.మహేందర్ వై జంగయ్య. ఎస్ సత్తిరెడ్డి. పోలెమోని జంగయ్య. డి శేఖర్ గౌడ్.ఎస్ గోపాల్ రెడ్డి రాపోల్ నరసింహ. జి రాములు. ఆర్ బాలయ్య. వై రామారావు. పి నాగేష్. వై నరసింహ. జె రాజు. వై యాదగిరి. మరియు గ్రామ పెద్దలు చిన్నల్లు పాల్గొన్నారు

# సీఎం సహాయ నిధి పేదోడికి అండ కెఎల్ఆర్



మహేశ్వరం,జులై 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం అమీర్పేట్ గ్రామ నికి చెందిన డప్పు భాగ్యమ్మ భర్త లేట్ జంగయ్య సీఎం రిలీఫ్ పండ్, ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా మంజూరైనా చెక్కును ఈరోజు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చేతుల మీదగా ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమలో గ్రామ శాఖ అధ్యక్షులు ఏ. రాజేందర్,మండల సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య ఇందిరమ్మ కమిటీ మెంబర్ కడల భాస్కర్ సీనియర్ నాయకులు కే. జె. ప్రసాద్ పాల్గొన్నారు..

# ఉపాధి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగకరం

- ఈ శిక్షణ సంస్థల పాత్ర కీలకం
- యువతకు నైపుణ్యవంతమైన శిక్షణలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు:కలెక్టర్. ఆదర్శ్ సురభి
- శిక్షణ కేంద్రాల ద్వారా ఉపాధి అవకాశాలు:ఎమ్మెల్యే.మేఘా రెడ్డి
- గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ.మల్లురవి



వనపర్తి,జులై 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
గ్రామీణ ప్రాంత ప్రజలకు,యువతకు నైపుణ్యాలు అందించేందుకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని నాగర్ కర్నూల్ ఎంపీ.మల్లు రవి అన్నారు.వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సమీపంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (RSETI) ను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి శాసన సభ్యులు మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ గ్రామీణ యువతకు నైపుణ్యాలు అందించేందుకు రూరల్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ సంస్థల పాత్ర కీలకం అని పేర్కొన్నారు.స్వయం ఉపాధి కోసం వచ్చేవారికి వేగంగా శిక్షణ కల్పించి ఉపాధి మార్గం చూపించాలని నిర్వాహకులకు సూచించారు.బి

**యువతకు నైపుణ్యవంతమైన శిక్షణలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు:కలెక్టర్. ఆదర్శ్ సురభి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో యువతకు నైపుణ్యవంతమైన శిక్షణలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోంది అని తెలిపారు.

**శిక్షణ కేంద్రాల ద్వారా ఉపాధి అవకాశాలు:ఎమ్మెల్యే.మేఘా రెడ్డి**

బిఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కేంద్రాల ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి వారికి స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించే విధంగా వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు.వనపర్తి లోని మొట్టమొదటి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం నెలకొలుపుతున్నట్లు తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ సహకారంతోనే ఇంత వేగంగా ప్రారంభించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డి ఆర్ డి ఓ ఉమాదేవి, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిజిఎం భాస్కరరావు, రీజనల్ హెడ్ సత్యనారాయణ, ఎల్డి ఎం శివకుమార్, సాయి ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, శిక్షణ సంస్థ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడిని ఖండించిన వద్దిరాజు



హైదరాబాద్,జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు.ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపడం, ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయడం కాంగ్రెస్ పాలనలో పరిపాటిగా మారిందని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర ఆందోళన చెందారు.కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందిగా ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేయగా అధికార పక్షానికి చెందిన నాయకులు ఇంటిపై దాడి చేసి నానా దుర్భాషలాడడం హేయమైన చర్య అని ఎంపీ రవిచంద్ర అన్నారు. ప్రశాంత్ రెడ్డి ఇంటిపై దాడికి దిగిన నాయకులపై కేసు నమోదు చేసి,చట్ట ప్రకారం శిక్షించాలని ఎంపీ వద్దిరాజు పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు.

# ప్రజావాణి వినతికి స్పందించిన కలెక్టర్

- ఆరోగ్యశ్రీతో బాబుకు ఉచిత గుండె చికిత్స



కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కరీంనగర్ జిల్లా చెంజర్ల గ్రామానికి చెందిన రామగిరి అంజయ్య తన ఏడున్నర నెలల బాబు గుండె రంధ్ర సమస్యపై ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. జిల్లా కలెక్టర్, వైద్య అధికారులు స్పందించి ఆరోగ్యశ్రీ ద్వారా హైదరాబాద్‌లో 14 జూలై 2025న ఉచిత శస్త్రచికిత్స చేయించారు. ప్రస్తుతం బాబు పరిస్థితి మెరుగ్గా ఉండగా, ఆధికారులకు అభినందనలు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా చిన్నపిల్లల గుండె ఆపరేషన్లు ఉచితంగా అందుతున్నాయని,ప్రైవేటు ఆసుపత్రుల్లో అప్పుల బారిన పడకుండా ఆరోగ్య మిత్రులను సంప్రదించాలంటూ అధికారుల సూచన.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలు బీసీ లకు కేటాయించాలి

నాంపల్లి, జులై 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):
స్థానిక సంస్థల ఎన్నికలలో నాంపల్లిలోని ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలు బీసీలకు కేటాయించాలని బీసీ సంఘం యూత్ మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ అన్నారు. గురువారం నాంపల్లి లో ఆయన మాట్లాడుతూ మండలంలో సగానికి పైగా బీసీ జనాభా ఉండి అధిక ఓట్లు బీసీలే వున్నాయి. ఈ స్థానిక ఎన్నికలలో బీసీ లకే కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ లు ఐక్యతతో పోరాడి పని చేస్తూ రానున్న రోజులలో ఏ ఎన్నికలు వచ్చిన బీసీ అభ్యర్థులకి అండగా ఉండాలన్నారు. బీసీ యువకులని చైతన్యం చేయడం కోసం మండలంలో రౌండ్ టేబుల్ సమావేశాలు, యువ సమ్మేళనాలు,బీసీ విద్యావంతుల సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# నూతనగృహప్రవేశాన్ని ప్రారంభించిన పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



శంకర్ పల్లి జులై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండలం దొంతన్ పల్లి గెట్ సమీపంలో గోపులారం గ్రామంలో.. మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ గృహప్రవేశం కార్యక్రమానికి వచ్చేసిన ముఖ్య అతిథి రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మరియు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య అనంతరం గోపులారం మాజీసర్పంచ్ పొడువు శ్రీనివాస్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొంతనపల్లి మాజీ సర్పంచ్ అశ్విని సుధాకర్ గోపులారం గ్రామస్తులు ,టైగర్ విష్ణు తంగడపల్లి శ్రీపాల్ సునీల్ దయాకర్ రాజేష్ బన్నీ డేవిడ్ కిరణ్ రమేష్, మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబసమేతంగా శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



అచ్చంపేట, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ దంపతులు, సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డా. అనురాధ కుటుంబసభ్యులతో కలిసి అష్టదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామిని ఈరోజు తెల్లవారుజామున భక్తిపూర్వకంగా దర్శించారు.ఆలయం ప్రధాన గోపురానికి చేరుకున్న నేతలందరికీ అర్చకులు, వేద పండితులు తిలకారాధన చేసి, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం గర్భగుడిలో పంచామృత అభిషేకం నిర్వహించి, అమ్మవారికి కుంకుమార్పణ చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందించడంలో ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపారు.ఆధ్యాత్మిక వైభవాన్ని స్వయంగా అనుభవించిన ఈ దర్శనంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ గారు ప్రజల మంగళకాంక్షలతో కూడిన సేవాభావాన్ని ప్రకటించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి, సద్భావన వాతావరణం పర్వదినాన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# బోనాల శుభాకాంక్షలు తెలిపిన నీల రవీందర్



షాద్ నగర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పిస్తూ భక్తులు ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త నీల రవీందర్ షాద్‌నగర్ ప్రజలకు బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బూత్ అధ్యక్షుడి తండ్రిని పరామర్శించిన బీజేపీ నేతలు



**సిరిసిల్ల, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్ గ్రామ బూత్ అధ్యక్షుడు రాకేష్ తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ఆయనను పరామర్శించేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రం, తిరుపతిరెడ్డి, నంది నరేష్, బాలగౌడ్, కిరణ్ నాయక్, సత్యం రెడ్డి, వినయ్ చరణ్, సుధాకర్, రాజేందర్ తదితరులు ఆసుపత్రిలో సందర్శించారు.

# గంగాధరలో బీజేపీ ఎన్నికల కార్యశాల



**గంగాధర, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా గంగాధర మండలంలో బీజేపీ రాష్ట్రశాఖ ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పంజల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ, మాజీ కౌన్సిలర్ వాసాల రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసాల రమేష్ మాట్లాడుతూ, గంగాధర మండల కేంద్రంలో ఎంపిటిసిలు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్ హోదాలకు బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి 11 సంవత్సరాల అభివృద్ధి పాలనను ప్రజలకు విపులంగా వివరించి, బీజేపీ విజయానికి మార్గం సులభతరంగా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# స్మార్ట్ సిటీ అవినీతిపై చర్యల సీపీఐ డిమాండ్




**కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందంటూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ మేయర్ సునీల్ రావు బినామీ కాంట్రాక్టర్ల ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఫుట్‌పాత్, రోడ్లు, పార్కుల నిర్మాణాల్లో నాణ్యత లేకపోవడం వల్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సునీల్ రావు అక్రమ ఆస్తులపై ఏసీబీ దాడులు జరిపి విచారణ చేయాలన్న డిమాండ్ వినిపించింది.ఈ ధర్నాలో పైడిపల్లి రాజు, బుచ్చన్న, పద్మ, రమేష్, భాస్కర్ తదితర సీపీఐ నేతలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేసిన బండి సంజయ్




**కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ప్రజా సంగ్రామ యాత్రలో కనిపించిన విద్యార్థుల కన్నీళ్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని ప్రభావితం చేశాయి. పాఠశాలకు ఎండలో నడుచుకుంటూ వెళ్లే విద్యార్థుల బాధను చూసిన ఆయన, సీఎస్ఆర్ నిధులతో దాదాపు 20,000 సైకిళ్లను కొనుగోలు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.హుజూరాబాద్ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో టెన్త్ తరగతి విద్యార్థులకు స్వయంగా సైకిళ్లు అందించారు. సైకిల్ ర్యాలీలో పాల్గొని విద్యార్థులతో కలిసి తొక్కారు.ఈ సందర్భంగా విద్యార్థులు విజిల్స్, నినాదాలతో ఉత్సాహం వ్యక్తం చేశారు."ఈ సైకిల్ మీ తొలి ఆస్తి, దీనిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోండి" అంటూ అంబేద్కర్, మోదీ వంటి నేతలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో 'మోదీ కిట్స్' కూడా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.

# అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**తిమ్మాపూర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలన, వసతుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. 1148 అంగన్‌వాడీలు, 1144 పంచాయతీ భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్లు, నివేశన స్థలాల కేటాయింపుపై అర్హులకు మంజూరు చేస్తామన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బానూరు పాఠశాల అభివృద్ధికి భరోసా ఇచ్చిన శ్రీమతి గోదావరి అంజిరెడ్డి



**పటాన్చెరు, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం భానూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన శ్రీమతి గోదావరి అంజిరెడ్డి, ప్రిన్సిపల్ అభ్యర్థన మేరకు పాఠశాల అభివృద్ధికి తన సహకారం నిరంతరం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరేషం, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, మల్లేశం, ప్రవీణ్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గాజుల రవీందర్‌కు పటేల్ శాంతమ్మ సాహిత్య పురస్కారం



**పరిగి, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వికారాబాద్ పరిగిలో భాస్కర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా రాష్ట్రస్థాయి పటేల్ శాంతమ్మ ధార్మిక సాహిత్య పురస్కారంను కరీంనగర్‌కు చెందిన కవి గాజుల రవీందర్ గారు అందుకున్నారు. ఎం.ఎల్.సీ చిన్నమైల్ అంజిరెడ్డి, డా. భాస్కరయోగి చేతులమీదుగా పురస్కారం ప్రదానం చేశారు.అభినందనలకు జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, లక్ష్మణరావు, భాస్కర్, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కిషోర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సుబేదార్ మాని కిషన్

**టేక్మాల్ ప్రతినిధి**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గ్రామ అధ్యక్షుడు భక్తుల కిషోర్ పుట్టినరోజు ఘనంగా నిర్వహించుకున్న సందర్భంగా మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు సుబేదార్ మాన్ కిషన్ ప్రత్యేకంగా భక్తుల కిషోర్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు ఇలాంటి పుట్టినరోజు ఇంకా ఎన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఇలాగే టేక్మాల్ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగాలని అందరికీ సేవలు అందించాలని అందరికీ అందుబాటులో ఉండాలని సుబేదార్ మాని కిషన్ తెలిపారు.

# కోహెడలో మెగా ఆయిల్ ఫాం ప్రారంభం

**•ఉద్యాన విప్లవానికి హుస్నాబాద్ కేంద్రం**

**హుస్నాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ కలిసి మెగా ఆయిల్ ఫాం ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రైతు ఏనుగు రామారావు 30 ఎకరాల్లో సాగుచేస్తున్న ఆయిల్ ఫాం కు అదనంగా 50 ఎకరాల్లో విస్తరణ జరగడంతో ఉద్యాన విప్లవానికి అంకురార్పణైనట్లు నిలిచింది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నర్మేటలో ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభం కాగానే పంట రవాణా ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, కోతల బెడద లేకుండా, వర్షానికి ఇబ్బంది తలెత్తనిది ఆయిల్ ఫాం సాగు ప్రధాన బలాంశంగా ఉంచారు. ఒక్క వరి పొలానికి అవసరమయ్యే నీటితో 5 ఎకరాలు ఆయిల్ ఫాం సాగు చేయవచ్చు అని వివరించారు.




మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఆయిల్ ఫాం సాగుతో అధిక ఆదాయం, విద్యుత్ -నీటి ఆదా సాధ్యమవుతుందని, రాష్ట్రంలోని రైతులకు ఇది ఆర్థిక భద్రతను కల్పిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాల ఆయిల్ ఫాం సాగు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. త్వరలో నర్మేటలో ఆయిల్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తామని, రైతుల తోట నుంచి ఫ్యాక్టరీ వరకు కిలోమీటర్ ప్రాతిపదికన రవాణా కిరాయిని కూడా ప్రభుత్వం భరిస్తుందన్నారు.కలెక్టర్ హైమావతి "నేను రైతుబిడ్డ" అంటూ అయిల్ ఫామ్ సాగుపై ప్రభుత్వ సబ్సిడీలు, నీటి సవరణలను వివరించి రైతులను ప్రోత్సహించారు.ఆయిల్ ఫేడ్ కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగు కోసం కార్పోరేషన్ చర్యలు తీసుకుంటోందన్నారు.

ఖమ్మం తరువాత అత్యధిక ఆయిల్ ఫాం సాగు సిద్దిపేట జిల్లాలోనే జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వేత్తలుగా మహిళలు ఎదగాలి

**•"ఇందిరా మహిళా శక్తి" సంబురాల్లో విప్ ఆది శ్రీనివాస్**

**వేములవాడ, జూలై17(నీలగిరిఎక్స్‌ప్రెస్)**

వేములవాడ పట్టణంలో డిఆర్డిఏ, షేర్ప్ ఆధ్వర్యంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజీలు, బీమా చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక శక్తిద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "ఇందిరా మహిళా శక్తి" పథకాన్ని ప్రవేశపెట్టారని వివరించారు.మహిళల పేరు






మీదే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెట్రోల్ పంపులు, రిష్ మిల్లులు వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని చూపుతోందన్నారు. అర్థిక సంవత్సరాల్లో లక్షల కోట్ల బ్యాంకు లింకేజీలు, వడ్డీ లేని రుణాల ద్వారా 4350 మహిళా సంఘాలకు ?5.72 కోట్ల సహాయం, ఘటనల బీమా, లోన్ బీమాతో పదిలక్షల వరకూ భద్రత, ఇప్పటివరకు వేములవాడలో 37 మందికి ?40.43 లక్షల బీమా అందించడమవట, మహిళా సంక్షేమం పట్ల ప్రభుత్వం ఉన్న అంకితభావాన్ని చూపుతోందన్నారు.ధర్మారం గ్రామంలో సోలార్ ప్లాంట్, 36 లక్షల విలువైన ఆర్టీసీ బస్సు వినియోగంలోకి రావడం, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, స్టిచింగ్ సెంటర్లు, డైరీలు, మైక్రో ఎంటర్‌ప్రైజ్ వంటి ప్రాజెక్టులు మహిళలకు కొత్త దిశ చూపుతున్నాయి.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శేషాద్రి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మహిళా సంఘాల నాయకులు, మండల ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# దండుపల్లి రహదారి అసౌకర్యానికి కారణం



**మనోహరాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి గ్రామం వర్షాకాలం వచ్చినప్పటి నుండి రోడ్డుగా కాక, గుంతల పాదమార్గంగా మారింది. వర్షం కురిసిన ప్రతీసారి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతుండటం స్థానికుల్ని తీవ్ర అసంతృప్తికి గురిచేస్తోంది. ఈ మార్గం వర్గల్ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అనేక గ్రామాల ప్రజలు ఇక్కడినుంచి ప్రయాణిస్తుంటారు. అయితే రంగాయపల్లి శివారులోని అగర్వాల్ కంపెనీకి చెందిన హెవీ వెహికిళ్లు ఈ మార్గంలో తరచూ ప్రయాణించడంతో రోడ్డు మరింత దెబ్బతింది. గుంతలు పెరిగిపోతుండటంతో ప్రమాదాల భయం, ప్రయాణ అసౌకర్యం పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఉన్నత అధికారులు తక్షణ స్పందన చూపించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రయాణదారులకు సురక్షిత మార్గం కల్పించడం అత్యవసరమని వారు సూచిస్తున్నారు.

గ్రామ పంచాయతీ నుండి ఐదు నుండి ఆరు సార్లు రోడ్డు మరమ్మతులు చేశాము. కానీ ప్రైవేటు కంపెనీ హెవీ వెహికిల్ లు వెళ్ళడంతో అక్కడ అదే పరిస్థితి ఏర్పడుతుంది.

**హేమలత, గ్రామపంచాయతీ కార్యదర్శి దండుపల్లి.**

గుంతల రోడ్డు వల్ల ద్విచక్ర వాహనాలపై వెళ్ళేటప్పుడు ప్రయాణికులకు చాలా ఇబ్బంది అవుతుంది. రోడ్ మరమ్మతులు చేయడం కాకుండా శాశ్వత పరిష్కారం అయ్యేలా చూడాలి.

**పంజ దుర్గేష్, గ్రామ యువకులు**

## కాజీపేట-వడ్డేపల్లి అభివృద్ధికి నాయిని నేతృత్వంలో సంస్కరణలు





**హనుమకొండ, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హనుమకొండ పట్టణంలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని తాగునీటి అవసరాలు తీరే విధంగా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. 13 డివిజన్లకు జీవనధారగా నిలుస్తున్న వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, కాజీపేట వాటర్ ట్యాంక్‌లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు గురువారం సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నేతలు ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి విధానం, నిల్వ సామర్థ్యాన్ని సమగ్రంగా పరిశీలించారు. రూ.2.50 కోట్లతో ఫిల్టర్ బెడ్ అభివృద్ధికి చర్యలు చేపడతామని ప్రకటించారు. గోపాలపూర్, కాజీపేట, వడ్డేపల్లి ప్రాంతాల్లో కొత్తగా 5 ఎంఎల్డీ కెపాసిటీ ట్యాంకులను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అధికారుల నుంచి శ్రేణుల సిబ్బందివరకు సమన్వయం తప్పనిసరిగా ఉండాలనే విషయాన్ని ఉద్ఘాటించారు. ఫిల్టర్ బెడ్‌కి భద్రతా నిఘానేత్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మరమత్తుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజా అవసరాలపై నిబద్ధతతో స్పందిస్తున్న ఎమ్మెల్యే నాయిని, నగర మేయర్ సుధారాణి భవానీనగర్, 47వ డివిజన్‌లో రూ.30 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రాంత అభివృద్ధే తన ధ్యేయమని, పార్టీలకతీతంగా అన్ని డివిజన్లకు నిధుల కేటాయింపు జరుగుతోందని నాయిని రాజేంద్ర రెడ్డి తెలిపారు.

## అల్ఫోర్స్ స్కూల్లో బోనాల జాతర



**కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. డా. వి. నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి, బోనం నృత్యాలతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపు, సాంప్రదాయ దుస్తుల్లో 150 మందికి పైగా విద్యార్థుల పాల్గొనడం, పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేసింది. తెలంగాణ సంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధినేత పిలుపు ఇచ్చారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## విపత్తును ఎదుర్కోవడంలో "ఆపద మిత్ర" వాలంటీర్లు ముందుండాలి

• జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో 142 మంది విద్యార్థులు, ఎన్సీసీ వాలంటీర్లకు "ఆపద మిత్ర" శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తూ, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల సమయంలో ప్రజల?? రక్షణకు ముందుండాలని సూచించారు. ఫైర్, వైద్య, పోలీస్ శాఖల సమన్వయంతో రక్షణ నైపుణ్యాలు నేర్పించామన్నారు. వాలంటీర్లు తమ నైపుణ్యాలను ఇతరులకు కూడా నేర్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కోహెడలో స్టీల్ బ్యాంక్ పంపిణీ

• పాల్గొన్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**హుస్నాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండల కేంద్రంలో, మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గారి జ్ఞాపకార్థంగా ఏర్పాటైన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్ పంపిణీ, ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, సేర్ఫ్ సీఈవో దివ్యా దేవరాజన్, దాన కిషోర్, కలెక్టర్లు హైమవతి, పమేలా సత్పతి, స్నేహ శబరిష్ తదితరులు హాజరై, 38 గ్రామైక్య సంఘాలకు స్టీల్ సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 276 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా శుభకార్యాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టింది. టిఫిన్ ప్లేట్స్, లంచ్ ప్లేట్స్, కప్పులు, గిన్నెలు, బకెట్లు, గ్లాసులు, చెంచాలు సహా అనేక స్టీల్ సామాగ్రితో కూడిన బ్యాంక్ ప్రజల వినియోగానికి అందుబాటులోకి వచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా ఆర్థికంగా బలమైన మహిళా సంఘాలు, పర్యావరణస్నేహమైన మార్గాలు ఒకేసారి ప్రజలకు చేరువయ్యాయి.

## మహిళా సాధికారతకి బలమైన తోడు ఇందిర మహిళా శక్తి



**మెదక్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో రాష్ట్ర ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను గుర్తుచేశారు. ఉజ్వల యోజన, సుకన్య సమృద్ధి, బేటీ బచావో-బేటీ పడావో, పీఎం ఆవాస్ యోజన వంటి పథకాలు మహిళల ఆత్మగౌరవం, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయి అని అన్నారు. ప్రభుత్వం ఆడపిల్లల భవిష్యత్తును బలంగా తీర్చిదిద్దేందుకు రుణ సదుపాయాలు, ఉచిత సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఆడిషనల్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పేదల కళ్లలో వెలుగు

• లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం



**కరీంనగర్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ - మాడేఖర్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో 47 మంది బీదవారికి ఉచిత క్యాటరాక్ట్ శస్త్రచికిత్స నిర్వహించారు.
రవాణా, భోజనం, మందులు, అద్దాలు ఉచితంగా అందించగా, డాక్టర్ శ్వేత పేషెంట్లకు చికిత్సానంతర సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్ చిదురు సురేష్, వైశ్య సేవా కేంద్రం, రేకుర్తి కంటి దవాఖాన ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైల్వే జీఎంని కలిసిన ఎమ్మెల్యే నాయిని

కాజీపేట అభివృద్ధిపై విజ్ఞప్తి



**వరంగల్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, విష్ణువర్ధన్ తో కలిసి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్ గారిని కాజీపేట స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాజీపేట బస్ స్టాండ్ నిర్మాణం కోసం స్థల కేటాయింపు, కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు 50 శాతం ఉపాధి అవకాశాలు, రైల్వే డివిజన్ ఏర్పాటుతో పాటు నిలిపిన రైళ్ల పునఃప్రారంభం అంశాలపై వినతి పత్రం అందించారు. జీఎం సానుకూలంగా స్పందించడంతో స్థానిక అభివృద్ధికి ఊహించదగిన పురోగతి కనిపిస్తోంది. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థపై చర్చకు కమిషన్ మెంబర్‌ను కలిసిన యువ నాయకుడు



**హైదరాబాద్, జూలై 17(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్‌లో తెలంగాణ విద్యా కమిషన్ ఛాంబర్‌లో తలకొండపల్లి యువ నేత పెరుమాండ్ల సురేష్ డా. చారకొండ వెంకటేష్ ను కలసి విద్యా రంగ సమస్యలపై చర్చ చేశారు. ఫీజుల దోపిడీ, విద్యార్థుల ఆత్మహత్యలు వంటి అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని కమిషన్ సభ్యులు తెలిపారు.